

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

# కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలి

- వారి పక్షాన ఉద్యమిస్తాం
- చట్టాలను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- పార్టీ ఆఫీసులో కార్మిక సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం

హనుమకొండ, మే 23 : సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలని దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. కార్మిక సంక్షేమ మహోత్సవంలో భాగంగా బీఆర్ఎస్ కార్మిక విభాగం, హనుమకొండ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ కార్మిక నాయకుడు నాయిని రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వినయ్ భాస్కర్ వివిధ సంఘాల నాయకులతో వారి సమస్యలపై చర్చించారు. 'కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ఎన్నికల హామీలో భాగంగా ఆటో కార్మికులకు రూ.12 వేలివ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మి కుల పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, గత ప్రభుత్వం కేటాయించిన కార్మిక భవన స్థలంలో భవన నిర్మాణం జరిపించాలని, చిరు వ్యాపారస్తుల చట్టం 2014ను వెంటనే గ్రేటర్ వరంగల్‌లో అమలు చేసి వసతులు కల్పించాలని, హోటల్, రెస్టారెంట్, షాపింగ్ మాల్స్ కార్మికులకు ఈఎస్ ఐ, పీఎఫ్, కనీస వేతనం రూ.26 వేలు, 8 గంటల పని అమలు చేయాలని, ఆశ, అంగన్వాడీ, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలి' అని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాలరాస్తున్నాయన్నారు. కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 27వ తేదీన హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈఎస్ఐ, పీఎఫ్ సంస్థల అధికారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 29వ తేదీన ఆటో కార్మికుల క్షతగాత్రుల కుటుంబాలను కలుసుకోనున్నట్లు పేర్కొన్నారు. 30వ తేదీన ఆటో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్ దగ్గర ఆటో కార్మికులపై రైల్వే అధికారుల వేధింపులు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తామన్నారు. జూన్ 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భారత రాష్ట్ర సమితి కార్మిక అనుబంధ విభాగం పాల్గొంటుందన్నారు. అలాగే ఈ నెల 31 తేదీన అన్ని కార్మిక సంఘాల ముగింపు సమావేశం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నాయకులు ఇంజాల మల్లేశం, ఈసంపల్లి సంజీవ, మహమూద్ ఇస్మాయిల్, తేలు సారంగపాణి, జీ నరహరి, రవీందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రఘు, శివకుమార్, రాజారపు రాజు, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# యథేచ్ఛగా అబార్షన్లు!

- ఇటీవల నెల్లికుదురు మండలంలో ఓ మహిళకు లింగనిర్ధారణ, అబార్షన్
- విచారణ చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ
- మానుకోటలోని క్రాంతి మెమోరియల్ హాస్పిటల్ సీజ్
- ముగ్గురిపై కేసు నమోదు
- లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో

మహబూబాబాద్ రూరల్, మే 23 : అబార్షన్లు, లింగనిర్ధారణ చట్ట విరుద్ధమని తెలిసినా కొందరు వీటిని ప్రోత్సహిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కొన్ని ప్రైవేటు హాస్పిటళ్లలో ఈ దందా యథేచ్ఛగా నడుస్తున్నది. లింగనిర్ధారణ చేయడంతోపాటు విచ్చలవిడిగా అబార్షన్లు చేస్తూ మహిళల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం వావిలాల శివారు బోటిమీద తండాకు చెందిన ఓ మహిళ అబార్షన్ చేయించుకోగా, ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. బోటిమీద తండాకు చెందిన ఓ మహిళ ఆర్ఎంపీ సాయంతో మహబూబాబాద్ పట్టణంలోని క్రాంతి మెమోరియల్ ప్రైవేట్ హాస్పిటల్‌కు అబార్షన్ కోసం వచ్చింది. ఈ క్రమంలోనే జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా డీఎంహెచ్‌వోకు ఫోన్ ద్వారా సమాచారం అందింది. వెంటనే వారు తమ టీమ్‌తో హాస్పిటల్‌కు వెళ్లి పరిశీలించారు. అప్పటికే మహిళ అబార్షన్ కోసం మాత్రలు మింగి అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అప్పటికే కడుపులో ఉన్న 23వారాల ఆడ శిశువు మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై శుక్రవారం క్రాంతి మెమోరియల్ హాస్పిటల్‌లో పూర్తి విచారణ చేపట్టారు. గతంలో ఆడపిల్ల ఉందని, వారం రోజుల క్రితం నెక్కొండలోని ఓ హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ చేయిస్తే ఆడపిల్ల పుడుతుందని చెప్పడంతో గ్రామంలోని ఆర్ఎంపీ సహకారంతో పట్టణంలోని క్రాంతి మెమోరియల్ హాస్పిటల్‌కు వచ్చినట్లు ఆమె భర్త నుంచి లిఖిత పూర్వకంగా సమాచారం తీసుకున్నట్లు డీఎంహెచ్‌వో రవిరాథోడ్ తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అంజేశామని, ఆయన ఆదేశాల మేరకు క్రాంతి మెమోరియల్ ప్రైవేట్ హాస్పిటల్ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటళ్లలో లింగనిర్ధారణ చేసి అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో హెచ్చరించారు.

## ముగ్గురిపై కేసు

గర్భ విచ్ఛిత్తికి పాల్పడిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ దేవేందర్ కథనం ప్రకారం.. నెల్లికుదురు మండలానికి చెందిన ఓ మహిళకు పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో గర్భవిచ్ఛిత్తి చేశారు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పూర్తి విచారణ చేపట్టింది. డీఎంహెచ్‌వో రవిరాథోడ్ ఫిర్యాదు మేరకు గర్భవిచ్ఛిత్తికి సహకరించిన, చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

*సరుకును దాటిచ్చేందుకు సినీఫక్కీలో స్కెచ్ వేశారు. కోటి రూపాయల గంజాయి.. పెద్దడీల్ కనుక ఎవరికీ అనుమానం రాకుండా చాకచక్యంగా కారును ముందు ఎస్కార్ట్‌లా, వెనుక ట్రాక్టర్‌లో ఎండు గంజాయి ప్యాకెట్లను ఏపీ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తూ వరంగల్ ఉర్సు గుట్ట వద్ద పోలీసులకు చిక్కారు.* – కరీమాబాద్, మే 23

# ముందు కారు.. వెనుక ట్రాక్టరు

## రూ.కోటి విలువైన గంజాయి తరలిస్తూ చిక్కారు

- ఏపీ నుంచి హైదరాబాద్.. వయా వరంగల్
- ఉర్సు గుట్ట వద్ద పట్టుకున్న యాంటీ నార్కోటిక్స్ టీం
- నలుగురి అరెస్ట్.. మరో ముగ్గురు పరారు



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, కారు



స్వాధీనం చేస్కున్న గంజాయి ప్యాకెట్లు

విశ్వసనీయ సమాచారంతో యాంటీ నార్కోటిక్స్ పోలీసులు శుక్రవారం వరంగల్ జిల్లా ఉర్సు గుట్ట వద్ద తనిఖీలు చేసి సుమారు 1,05,38,000 విలువైన 210 కిలోల 750 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని అడవి అన్నవరం నుంచి విరోదుల శ్రీను బయల్దేరి ఖమ్మంలో భాస్కర్, రాము, వినోద్‌ను కలిశాడు. నలుగురు కలిసి మహబూబాబాద్ జిల్లా మరిపెడ–తొర్రూరు నుంచి వరంగల్ మీదుగా హైదరాబాద్‌లో గంజాయి విక్రయించేందుకు వాహనంలో బయల్దేరారు. సమాచారం అందుకున్న పోలీసులు ఉర్సుగుట్ట వద్ద తనిఖీలు చేపట్టారు. స్విఫ్ట్ కారు ముందు ఎస్కార్ట్‌లా ముందు వెళ్లగా ట్రాక్టర్‌లో 210.750 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు తనిఖీలు చేసి వాహనాలను పట్టుకొని గంజాయి రవాణా చేస్తున్న గుగులోత్ భాస్కర్, కేతావత్ రా ము, కొర్ర వినోద్, విరోదుల శ్రీ నును అదుపులో కి తీసుకున్నారు. తల్లిబాబు, గోవిందమ్మ, శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వె ల్లడించారు. వారి నుంచి ట్రాక్టర్, స్విఫ్ట్ కారు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి నిందితులను పట్టుకున్న సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# మోసం చేసిన మిల్లులపై ఇంటలిజెన్స్ నజర్?

## వేబ్రిడ్జిలో ధాన్యం తక్కువ వచ్చిందని రైతుల నుంచి డబ్బులు వసూలు

నర్సింహులపేట, మే 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు పెట్టి ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలు తీసుకువెళ్లిన రైతులను వేబ్రిడ్జిలో తూకం తక్కువ వచ్చిందని మోసం చేసిన మిల్లులపై ఇంటలిజెన్స్ అధికారుల నజర్ వేసినట్లు సమాచారం. పెద్దనాగారం స్టేజీ జీపీ పరిధిలో ఉన్న ఓ మిల్లు యాజమాని ఏకంగా ట్రాక్టర్ తూకంలో తక్కువ వచ్చిందని రైతుల నుంచి పైసలు ఫోన్ పే చేయించుకున్నాడు. ఈ క్రమంలో అధికారులు వేబ్రిడ్జి తూకంలో తేడా ఉందని నిర్ధారించ డంతో కొంత మంది రైతులకు డబ్బులు తిరిగి ఇచ్చాడు. మిగతా వారికి పైసలు ఇవ్వకుండా బెది రిస్తుండడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మిల్లు యాజమానిని పోలీసు లు సైతం విచారించి రైతులకు డబ్బులు తిరిగి చెల్లించాలని చెప్పినా వినడం లేదు. డబ్బులు చెల్లించడం లేదని రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మిల్లు యాజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# 'పోచంపల్లి'లో తీరిన తాగునీటి సమస్య




బోరు మోటర్ పంపు మరమ్మతు చేసి నీటిని విడుదల చేస్తున్న కార్మికులు

పెద్దవంగర, మే 23: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని పోచంపల్లి గ్రామ మెయిన్ రోడ్డు నివాస గృహాలకు నీటి కష్టాలు తీరాయి. జీపీ కార్మికులు బోరు పంపునకు మరమ్మతులు చేసి నీరు విడుదల చేశారు. కొద్దిరోజులుగా బోరు మోటర్ మరమ్మతుకు రావడంతో పాటు మిషన్ భగీరథ నీరు సైతం సరిగా రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోరు మోటర్ పంపును బయటకి తీస్తుండగా పంపు బోరులోనే పూడి పడిపోయింది. ఈ క్రమంలో నమస్తే తెలంగాణ దినపత్రికలో ఇటీవల 'పోచంపల్లిలో నీటి కష్టాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు, జీపీ కార్మికులు శుక్రవారం బోరు పంపును బయటకు తీసి మరమ్మతులు చేసి మోటర్ బిగించి కాలనీ వాసులకు నీరు అందించారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

గణపురం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు, బస్తాల్లో మొలకెత్తిన ధాన్యం







కురవి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో బస్తాల్లోంచి బయటకు వచ్చిన మొలకలను చూపుతున్న రైతు

ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకొని నిశ్చింతగా ఉండాల్సిన రైతుకు.. అధికారులు, నిర్వాహకుల అంతులేని నిర్లక్ష్యం శాపంలా మారుతున్నది. రోజులు గడుస్తున్నా ధాన్యం తరలించడంలో ఆలస్యం చేస్తుండడంతో వడ్లకు మొలకలు వచ్చి అన్నదాతను ఆగం చేస్తున్నది.

# మొలకెత్తిన ధాన్యం.. రైతన్న ఆగం

## అధికారుల నిర్లక్ష్యంతో కాంటాలైనా కొనుగోలు కేంద్రాల్లోనే వడ్ల బస్తాలు

కురవి/గణపురం, మే 23: మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో రైతు బదావత్ యుగేంధర్‌కు చెందిన ధాన్యం కాంటా పెట్టారు. టార్పాలిన్లు కప్పి నిల్వ ఉంచారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బస్తాల నుంచి వడ్లు మొలకలు వస్తుండడం చూసి రైతులు లబోదిబోమంటున్నారు. సకాలంలో లారీలు రాక, కాంటా అయిన బస్తాలు మిల్లులకు చేరక వర్షానికి తడిసిపోయాయి. మొలకెత్తుతున్న వడ్లను తీసి మళ్లీ ఆరబెట్టి బస్తాల్లో నింపాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటివరకు కేంద్రంలో 1,282 బస్తాల ధాన్యం కాంటా పెట్టామని మరో 8వేల బస్తాలకు సరిపడా ధాన్యం రాశులున్నాయని నిర్వాహకుడు జితేందర్ తెలిపారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని ఓడీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రంలో ఇదే పరిస్థితి నెలకొంది. ఓ రైతు 15 రోజుల క్రితం ధాన్యం తీసుకొస్తే ఐదు రోజుల క్రితం కాంటాలు పెట్టారు. కానీ, తరలింపులో జాప్యం, రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి వడ్లన్నీ తడిసి బస్తాల్లోనే మొలకెత్తింది. ప్రభుత్వం, కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యంతో నిండా మునుగుతున్నామని రైతులు లబోదిబోమంటున్నారు.

# నిట్‌లో ప్లేస్‌మెంట్లు అద్భుతం

- 79.7శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు
- ఈసీఈ విద్యార్థి సోమిల్ మల్దానికి రూ.64.3 లక్షల ప్యాకేజీ
- వివరాలు వెల్లడించిన నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, మే 23 : వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ప్లేస్‌మెంట్‌లో అద్భుత ఫలితాలు సాధించింది. 79.7శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, ఇందులో ఈసీఈ విద్యార్థి సోమిల్ మల్దానికు రూ.64.3 లక్షల గరిష్ఠ ప్యాకేజీ లభించినట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం 290కి పైగా సంస్థలు క్యాంపస్‌ను సందర్శించాయని, పరిశ్రమల్లో మందగమనం కొనసాగుతున్న తరుణంలోనూ నిట్ తన ప్లేస్‌మెంట్‌ను మెరుగుపరచడంతోపాటు సంస్థ ప్రదర్శించిన స్థిరత, విద్యార్థుల పరిశ్రమ సిద్ధతను స్పష్టంగా చాటిందన్నారు. ఈ సంవత్సరం 1,508 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్‌కు నమోదు చేసుకోగా, వీరిలో 791 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 717 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్లు ఉన్నారని, వీరిలో 1,201 మంది ఉద్యోగాలు పొందారన్నారు. యూజీలో 679 మంది, పీజీలో 522 మంది కాగా, మొత్తం 79.7శాతం ప్లేస్‌మెంట్ రేటుగా ఉందన్నారు. గత సంవత్సరం 76శాతంతో పోలిస్తే స్పష్టమైన పురోగతిని కనిపిస్తున్నదన్నారు. యూజీ విద్యార్థులకు 85.8 శాతం ప్లేస్‌మెంట్ రేట్, పీజీ విద్యార్థులకు 72.8 శాతం రేటు నమోదైందన్నారు. మొత్తం విద్యార్థులందరికీ సగటు ప్యాకేజీ రూ.14.35లక్షలు ఉండగా, యూజీ విద్యార్థులకు రూ.16 లక్షలు, పీజీ విద్యార్థులకు రూ.12.20లక్షలుగా ఉందన్నారు. తొలిసారి పీహెచ్‌డీ విద్యార్థుల ప్లేస్‌మెంట్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రత్యేక ప్రయత్నాలు చేయగా, ఆరుగురు పీహెచ్‌డీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు, వీరి సగటు ప్యాకేజీ రూ.9 లక్షలుగా ఉందన్నారు. ప్లేస్‌మెంట్ విజయాలపై నిట్ డైరెక్టర్ స్పందిస్తూ 'ఇది మా వ్యూహాత్మక దృష్టి, సహకారతత్వం, విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు తగినవారీగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తున్నదన్నారు. ఇది విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడమే కాకుండా, వారి ఆత్మవిశ్వాసాన్ని, కార్పొరేట్ మానసికతను బలపరిచిందని సీసీపీడీ హెడ్ ప్రొఫెసర్ పీ హరికృష్ణ తెలిపారు.



నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి



ఉద్యోగం పొందిన సోమిల్ మల్దాని



పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న డీపీవో వీరభద్రయ్య



వృద్ధురాలిని దర్శనానికి తీసుకెళ్తున్న పోలీసులు

ఆటోలు లేక బురదలో త్రివేణి సంగమానికి కాలినడకన వెళ్తున్న భక్తులు





గుడి దక్షిణ ద్వారం వద్ద కొనసాగుతున్న పనులు

# కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్.. మళ్లీ టోల్ వసూల్

గ్రామపంచాయతీ టోల్ వసూళ్ల వల్ల వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, వాటిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం ఉదయం ప్రకటించారు. నిర్వాహకులు కొద్ది సేపు వసూళ్లను నిలిపివేసి, మళ్లీ యధాతథంగా టోల్ వసూల్ చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు వన్ వే ఏర్పాటు చేయడంతో మహదేవపూర్ నుంచి అన్నారం మీదుగా కాళేశ్వరానికి వెళ్లే వాహనాలతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. అన్నారం–పలుగుల రోడ్డులో ట్రాఫిక్ జామ్‌ను కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే క్లియర్ చేశారు. క్యూలో భక్తులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నవరత్న మాల హారతి నిర్వహిస్తున్న కాశీ పూజారులతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి, దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని వేద పండితులను అభినందించారు.



వాహన దారులకు ఇస్తున్న టోల్ రసీదు

## ముమ్మరంగా పారిశుధ్య నిర్వహణ..

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపడుతున్నారు. సరస్వతీ పుష్కర, గోదావరి ఘాట్, తాత్కాలిక బస్టాండ్, రహదారుల వెంట నిత్యం చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను సేకరించి సం చుల్లో నింపి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. భూ పాలపల్లి డీపీవో వీరభద్రయ్య, మంచిర్యాల, పెద్దపల్లి డీపీవోల నేతృత్వంలో ఇద్ద రు డీఎల్పీవోలు, 50 మంది ఎంపీడీవోలు, ఎంపీవోలు, 156 మంది పంచాయతీ కార్యదర్శులు, 496 మంది ప్రైవేట్ పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. 60మంది మల్టీపర్పస్ వర్కర్లను రిజర్వ్‌లో ఉంచారు. అధికారులు నిత్యం పారిశుధ్య నిర్వహణ చేయిస్తున్నారు. కాగా, నస్పూర్ కాలనీకి చెందిన కానిగంటి మల్లేశ్ పుష్కరాలకు వచ్చి బైక్‌పై వెళ్తుండగా పోలీసు వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన సేవల కోసం మహదేవపూర్ ఆసుపత్రికి తరలించారు. దైవ దర్శనానికి వచ్చే దివ్యాంగుల కోసం దక్షిణ ద్వారం వైపు మెట్ల మార్గం నిర్మిస్తున్నారు.




త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- సరస్వతీ పుష్కరాల్లో 9వ రోజూ రద్దీ
- త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు
- జనంతో కిక్కిరిసిన ఆలయ పరిసరాలు
- వర్షంతో రహదారులు అస్తవ్యస్తం
- వాహనాల రాకపోకలకు అంతరాయం

# త్రిలింగ క్షేత్రం.. భక్తజన కోలాహలం



స్వామి వారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



యాదాద్రి లడ్డూలను ఆలయానికి తరలిస్తున్న సిబ్బంది



ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

మహదేవపూర్,(కాళేశ్వరం)/భూపాలపల్లి రూరల్, మే 23: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాల్లో త్రిలింగ క్షేత్రంలో భక్తజనం కోలాహలం నెలకొంది.శుక్రవారం 9వ రోజు పెద్ద ఎత్తున భక్తు లు కాళేశ్వరానికి చేరుకుని త్రివేణి సంగమంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తిశ్రద్ధలతో పూజించి నదీమ తల్లికి చీరె, సారె, ఒడి సమర్పించారు. నదీ తీరం వద్ద సైకత లింగాలకు, వీఐపీ ఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్వతీ మాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి సెల్ఫీలు దిగారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. సుమారు 2లక్షలకు పైగా మంది భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు మరిన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేపట్టారు. హంపీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విరూపాక్ష విద్యారణ్య స్వామి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. సరస్వతీ నవరత్న మాలా హారతి శోభాయమానంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున వస్తుండడంతో కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో తయారుచేసిన 30 వేల లడ్డూలు సరిపోకపోవడంతో అధికారులు యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నుంచి అదనంగా మరో ఐదు వేల లడ్డూలను తెప్పించారు.



గోదావరికి సరస్వతీ నవరత్న మాలా హారతి ఇస్తున్న అర్చకులు